ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
https: epaper. prabhathasamacharam.com
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
శుక్రవారం । 6 మార్చి 2026 । 10 పేజీలు




ఉప ముఖ్యమంత్రి భట్టి తనయుడి వివాహం

## ప్రత్యేక ఆకర్షణగా 'పాదయాత్ర' బంధువులు




ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

# వంతెనలు దాటాలంటే వణుకు



- అదిలాబాద్ రహదారులపై మృత్యుఘంటికలు
- వంతెనల నిర్మాణం.. అగ్రిమెంట్లకే పరిమితం!
- గుడిహత్నూరు-ఉట్నూరు దారిలో కునారిల్లుతున్న బ్రిడ్జిలు
- గాల్లో దీపాల్లా ప్రయాణికుల ప్రాణాలు
- కాంట్రాక్టర్ల పేచీ.. అధికారుల ఒత్తిడి.. వెరసి నిలిచిన పనులు
- బిల్లులు రావడం లేదంటున్న గుత్తేదారులు
- నిధులు మంజూరైనా అడుగు ముందుకు పడని వైనం
- ప్రాణ సంకటంగా ఉట్నూరు ప్రయాణం

అదిలాబాద్ జిల్లాలో పలు పాత వంతెనలు ప్రమాదకరంగా మారడంతో వాటిపై నుండి ప్రయాణం చేయాలంటేనే ప్రాణసంకటంగా మారుతుంది. శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలు ప్రమాద గంటికలను మోగిస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన, ఇరుకైన వంతెనలతో ఎన్నో ప్రమాదాలు జరిగిన పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇప్పటికే ఎన్నో వంతెనలపై నుండి లారీలు, బస్సులు, కార్లు పడి ప్రమాదాలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి అయిన గుడిహత్నూర్, ఉట్నూర్ మండలంలోని రహదారిపై దశాబ్దాల క్రితం నిర్మించిన పాత వంతెనలు ప్రయాణికులను, వాహన చోదకులను వణికిస్తున్నాయి. ఈ రహదారిపై పురాతన వంతెనలే దర్శనమిస్తున్నాయి. వందేళ్ల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలా వ్యవస్థకు చేరుకొని ప్ర మాదకరంగా మారాయి. భారీ వాహనాలతో పాటు బస్సులు ఇతర వాహనాలు వంతెనలు దాటే సమయంలో ఊగుతూ ప్రయాణికులను వణికిస్తున్నాయి పురాతన వంతెనలు.




## ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక

- అన్ని శాఖల భాగస్వామ్యంతో 99 రోజుల పాటు కొనసాగనున్న కార్యక్రమం..
- నేడు జిల్లాకు మంత్రి జూపల్లి కృష్ణా రావు రాక
- దిశా నిర్దేశం చేయనున్న మంత్రి
- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతానికి కృషి చేయాలి : కలెక్టర్ రాజర్షి షా

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాదని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' పై మండల, జిల్లా స్థాయి అధికారులకు ఆయన ప్రత్యేక అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును మెరుగుపరచడం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు.

జిల్లా వ్యాప్తంగా

## నిఘా కెమెరాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా నిఘా కెమెరాల ఏర్పాటు ఉద్యమంలా కొనసాగించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నిఘా కెమెరాలు ఉంటే చోరీలు, సంఘ విద్రోహ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఐఎంఏ ఆదిలాబాద్ శాఖ అందజేసిన 37 నిఘా కెమెరాలను గురువారం కమాండ్ కంట్రోల్ రూంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, వెంకట్‌రెడ్డిలతో కలిసి ఎస్పీ ప్రారంభించారు.







## ఉన్నత లక్ష్యం కోసం ప్రతీ విద్యార్థి శ్రమించాలి

- ఆశ్రమ పాఠశాల విద్యార్థుల కోసం ఇగ్నైట్ యువర్ డ్రీమ్స్
- ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మట్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు ఉన్నత లక్ష్యం దృష్టిలో పెట్టుకుని శ్రమించి ఉన్నత విద్యావంతులు కావాలని ఐటిడిఏ పిఓ యువరాజ్ మార్మట్ అన్నారు. గురువారం ఉట్నూరులోని పిఎఆర్‌సిలో ఇగ్నైట్ యువర్ డ్రీమ్స్.. మోటివేషన్ మరియు కెరియర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలోని ఒక్క 124 గిరిజన బాలల బాలికల ఆశ్రమ పాఠశాలలతో పాటు గిరిజన వసతి గృహాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.. పదో తరగతి పరీక్షల్లో ఫస్ట్ గ్రేడ్ లో ఉత్తీర్ణ సాధించి.. పదో తరగతి తర్వాత కోర్సులు ఉంటాయన్నారు.



# జిల్లా వ్యాప్తంగా నిఘా కెమెరాల ఏర్పాటు

**వ్యాప్తంగా కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి**
**కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కెమెరాల ప్రారంభం**
**మున్సిపాలిటీ పరిధిలో కెమెరాలతో నిఘా**
**ఒక కెమెరా వందమంది పోలీసులతో సమానం**
**నేరాలు, దొంగతనాలు జరగకుండా పర్యవేక్షణ.**
**37 కెమెరాలను అందించిన**
**ఆదిలాబాద్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్**
**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
జిల్లా వ్యాప్తంగా సిసిటీవీ కెమెరాల ఏర్పాటు ఒక ఉద్యమంలో కొనసాగాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ పిలుపునిచ్చారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా అందజేసిన 37 (21 నూతన ం 16 రిపేర్ చేసిన కెమెరాలను) కెమెరాలను జిల్లా ఎస్పీ అధికారులు డాక్టర్ల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఒక కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా విధులను నిర్వర్తిస్తుందని, 24 గంటలు పర్యవేక్షణతో దొంగతనాలను నేరాలను, ఘోరాలను అరికట్టవచ్చని, ఒకవేళ జరిగిన వాటిని ఛేదించవచ్చని ప్రతి ఒక్కరూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పట్టణంలో నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు తమ వార్డులలో కనీసం 10 కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా, అదే విధంగా గ్రామాలలో ఎన్నికైన నూతన సర్పంచులు తమ గ్రామాలలో కెమెరాలను ఏర్పాటు చేసుకొని నేరాలను జరగకుండా అడ్డుకోవడానికి, ఒకవేళ జరిగిన నేరాలలో నిందితులను పట్టుకోవడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పట్టణంలో ప్రస్తుతం 250 కెమెరాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ముగ్గురు సిబ్బందితో 24 గంటలు పర్యవేక్షణతో కొనసాగుతుందని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను బస్టాండ్ నందు, రైల్వే స్టేషన్ నందు, మహాలక్ష్మి వాడ, రిమ్స్ ప్రాంగణాల నందు ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు. వ్యాపార సంస్థల సంఘాలు, ఇతర సంఘాలు సిసిటివి కెమెరాల ఏర్పాటుకు జిల్లా పోలీసులతో సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉన్న మొత్తం సీసీటీవీ కెమెరాలను హైదరాబాద్లోని కమాండ్ కంట్రోల్స్ సెంటర్ కు అనుసంధానం చేయడం జరిగిందని, సీసీటీవీ కెమెరాలు ప్రజల రక్షణ, భద్రత, బాధ్యతలను చేసే పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, ఐఎంఏ అధ్యక్షుడు వెంకటరెడ్డి, డాక్టర్లు, రిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ముఖ్య సలహాదారుతో నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి భేటీ

**నిర్మల్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణ అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తామని మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తిలు పేర్కొన్నారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా గురువారం నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీహరి రావు, మాజీ మంత్రి వేణుగోపాల చారితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులను సమన్వయం చేసి, విజయవంతంగా ముందుకు తీసుకెళ్లినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మల్ అభివృద్ధిలో తనవంతు సహకారం అందించాలని కోరారు. నిర్మల్ పట్టణ సమస్యల పరిష్కారానికి అత్యధిక నిధులు కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నిర్మల్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్తానని సుదర్శన్ రెడ్డి భరోసా ఇచ్చారని చైర్మన్ అప్పల కావ్య గణేష్ చక్రవర్తిలు పేర్కొన్నారు.





## యెంధా గ్రామంలో
# కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**10 లీటర్ల గుడుంబా స్వాధీనం**
**నంబర్ ప్లేట్లు లేని 5 బైకులు స్వాధీనం**
**అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవు**
**ఉట్నూర్ సిఐ ఎం ప్రసాద్**

**ఉట్నూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఉట్నూర్ మండలం యెంధా గ్రామంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఉట్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో ఉట్నూర్ ఎస్సై గుంపుల విజయ్, ఇందరవెల్లి ఎస్సై ఈ సాయన్న , నార్నూర్ ఎస్సై శ్రీ సాయి మొత్తం 18 మంది పోలీసు సిబ్బందితో గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా తయారు చేస్తున్న గుడుంబాపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించగా 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని రెండు కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే నంబర్ ప్లేట్లు లేకుండా సంచరిస్తున్న 5 మోటార్ సైకిళ్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్థులతో సమావేశమై గుడుంబా తయారీ, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. ప్రజలు ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల రక్షణ, భద్రత కోసం ఇటువంటి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు (కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు) కొనసాగుతాయని తెలిపారు.

# అడవుల రక్షణకు సహకరించాలి

**బెజ్జూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
అడవులు వన్యప్రాణుల రక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బెజ్జూర్ రేంజ్ సులుగు పల్లి బీట్ అధికారి మురళి అన్నారు. గురువారం మండలంలోని సలుగు పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం మరియు ఉపన్యాసం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నేడు జిల్లాకు మంత్రి జూపల్లి రాక

**ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష**
**ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ..**
**పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం**

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్ఛార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు నెరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా స్పెషలిస్ట్ క్యాంపును ఆయన ప్రారంభిస్తారు. అనంతరం 11 గంటలకు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే సన్నాహక సమావేశంలో పాల్గొంటారు.

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష...**
నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ఆయా జిల్లాల ఐడీఓసీల నుంచి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.



# అదిలాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మార్చి 10న మెగా జాబ్ మేళా

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లా పోలీస్‌ల ఆధ్వర్యంలో.... మార్చి 10 తేదీన నిర్వహించబోయే మెగా జాబ్ మేళా కు పలు ముఖ్య పట్టణాల నుండి వివిధ కంపెనీల నుండి... ప్రతినిధులు రాబోతున్నారని... నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని... జాబ్ మేళా లింక్ ను జిల్లాలోని ప్రతి స్టేషన్ పరిధిలో ఆ స్టేషన్ల ఎస్ఐల ద్వారా, పోలీస్ సిబ్బందిచే, పత్రికల ద్వారా,ఎలెక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించడం జరుగుతుందని... జాబ్ మేళా లింక్ ఓపెన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని, మార్చి 10 తేదీన మీ దగ్గర ఉన్న సర్టిఫికెట్స్ వెంట తీసుకుని రావాలని... ముఖ్యంగా ఆదివాసి నిరుద్యోగ యువతీ యువకులు ఇంత చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సంపాదించి వారి వారి కుటుంబ పరిస్థితిని మార్చుకునేందుకు చక్కటి వేదిక అని ... ఆదివాసి సంఘాల నాయకులు, గ్రామాల పటేళ్లు ,పెద్దలు ఈ జాబ్ మేళా పై దృష్టి సారించి వారి వారి గ్రామాలలోని నిరుద్యోగ యువతీ యువకులను జాబ్ మేళాకు వచ్చేలా చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు.







# పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువు

**జైనూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
జైనూర్ మండలం జంగాం గ్రామం ఈ గ్రామంలో ఉర్దూ పాఠశాల ఉంది ఈ పాఠశాలలో మరుగుదొడ్లు సక్రమంగా లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. 2014 సంవత్సరంలో స్వచ్ఛభారత్ పథకం కింద మరుగుదొడ్డి నిర్మించినప్పటికీ మరమ్మ తులు నోచుకోక దుర్గంధం వెదజల్లుతున్నాయి. పాఠశాలలో నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఉన్న పాత మరుగుదొడ్లకు తలుపులు సక్రమంగా లేకపోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో ఒకరు ఉపాధ్యాయులతో పాటు ఒకటి నుంచి 5వ తరగతి వరకు 32మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మరుగుదొడ్లు లేక పాఠశాల పరిసర ప్రాంతాల ఇళ్లలోకి వెళ్లాల్సివస్తుంది. గత ప్రభుత్వంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో ఈ పాఠశాల ఎంపికైనప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు సమీపంలో అంగన్వాడి కేంద్రం ఉన్నప్పటికీ కేంద్రానికి సైతం మరుగుదొడ్డి లేకపోవడంతో బాల బాలికలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుంది.పశువులు పాఠశాల చుట్టూ తిరుగుతున్నాయి. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి నాగులవాయి పాఠశాలకు ప్రహరీ గోడ



నిర్మించడంతోపాటు మరుగుదొడ్లను మరమ్మత్తులు చేపట్టివిద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రహరీ గోడ లేక పశువులతో ఇబ్బంది పాఠశాలకు ప్రహరీ గోడ సైతం లేకపోవడం వల్ల పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలి



## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' పై మండల, జిల్లా స్థాయి అధికారులకు ఆయన ప్రత్యేక అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును మెరుగుపరచడం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ప్రజా పాలన దరఖాస్తుల క్రోడీకరణ, అర్హుల ఎంపికలో పారదర్శకతతో నిర్వహించాలన్నారు. విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలనీ, మండల, జిల్లా స్థాయి అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేసి, అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి



అందేలా చూడాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలనీ, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు జిల్లాలో జరిగిన అభివృద్ధి పనుల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో స్రవంతి, జెడ్పి సీఈవో రవీందర్, ఎంపీడీవోలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



### ఉట్నూర్ ఏఎస్పీగా
# రుత్విక్ సాయి కొట్టె

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
ఉట్నూర్ ఏఎస్పీగా 2023 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రుత్విక్ సాయి కొట్టె గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో ఆయన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గతంలో వేములవాడ ఏఎస్పీగా పని చేసిన రుత్విక్ సాయి కొట్టె.. ఉట్నూర్ ఏఎస్పీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ఉట్నూర్ సబ్ డివిజన్ గురించి ఎస్పీతో చర్చించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ వివరించారు.

## ఎన్నికల హామీని నెరవేర్చిన సర్పంచ్

**కాసిపేట, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం పెద్దనపల్లి బీఆర్ఎస్ సర్పంచ్ కల్వల శరత్ కుమార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద కుటుంబానికి కళ్యాణ కానుక అందజేశారు. గ్రామ పంచాయతీలోని నాయకపుగూడ గ్రామంలో సోమని పోసు-రమేష్ దంపతుల కుమార్తె రమ్య వివాహానికి రూ.6016 చీర, సారేను స్వయంగా పెళ్లి కూతురు ఇంటికి వెళ్లి సర్పంచ్ దంపతులు అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఆడపిల్ల పెళ్లికి చీర, సారె కట్న కానుకలు గౌరవప్రదంగా పంపించాలనే ఉద్దేశంతో ఈ యొక్క కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని తెలిపారు.





### ముక్రా(కె)లో సీసీ
# కెమెరాల ఏర్పాటు
## ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ బండారి రాజు

**ఇచ్చోడ, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
జిల్లా వ్యాప్తంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఒక ఉద్యమంలా కొనసాగాలనే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు. ఇచ్చోడ మండలం ముక్రా-కె గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ ప్రతినిధుల సహకారంతో గ్రామంలోని ముఖ్య ప్రాంతాలలో 6 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో శాంతి భద్రతలను కాపాడటంతో పాటు దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టడానికి ఈ కెమెరాలు ఉపయోగపడతాయని ఇచ్చోడ ఎస్హెచ్ఓ బండారి రాజు తెలిపారు. నేరాల నివారణకు సీసీటీవీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని, ఒక కెమెరా వందమంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు, గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి తమ గ్రామాలు, కాలనీలు, వ్యాపార సంస్థల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకవేళ నేరాలు జరిగినా నిందితులను గుర్తించి పట్టుకోవడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

### ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'ను
# విజయవంతానికి కృషి చేయాలి
## మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'ను ఆదిలాబాద్ పట్టణంలో విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. శుక్రవారం నుండి పట్టణంలోని 49 వార్డుల సందర్శన ప్రారంభమవుతుందని, అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కాలనీల్లో అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులకు సంబంధించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని, ప్రజల చెంతకు పాలనను తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య



ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్, ఆర్వో కల్యాణ్, మేనేజర్ స్వామి, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహించాలి

**మామడ, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజు మెరుగైన పారిశుధ్యం కొనసాగించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" కింద చేపట్టిన 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా, గురువారం ఉదయం మామడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో ఆసుపత్రులు, కార్యాలయాలు, వీధులు, అన్ని ప్రాంతాలలో పరిశుభ్రతను కొనసాగించాలని చెప్పారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని వివరించారు. ఆసుపత్రి ప్రాంగణం మొత్తం శుభ్రంగా తీర్చిదిద్దాలని తెలిపారు.







## నిర్మాణ పనులను వేగవంతం చేసి

# త్వరగా పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**మంచిర్యాల, మార్చి 5 (ప్రభాత సమాచారం)** అభివృద్ధిలో భాగంగా చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలంలో చేపట్టిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా చేపట్టిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మండలంలోని సోమనపల్లి గ్రామంలో ప్రభుత్వం 200 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల స్థలాన్ని చెన్నూరు మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి సందర్శించారు. పాఠశాలకు నిర్మాణానికి సంబంధించి పనులను త్వరగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను సందర్శించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టి పనులు కొనసాగిస్తుందని, ఈ క్రమంలో గుత్తేదారుల సమన్వయంతో పనులు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, పెండింగ్ పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులలో పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న ఆదనపు తరగతి గదులు, భోజనశాల, వంటశాలల నిర్మాణ పనులు, మధ్యాహ్నం భోజన పథకం అమలును మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతిగదులు, భోజనశాలను పరిశీలించారు. మండల తహసిల్దార్ పరిధిలో భూభారతి దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అభివృద్ధి కార్యక్రమాలపై మండల పంచాయతీ అధికారి, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులను సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

# జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థి ఆచూకీ లభ్యం





**చెన్నూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని జ్యోతిబాపూలే హాస్టల్లో ఉంటూ తొమ్మిదో తరగతి విద్యనభ్యసిస్తున్న పెద్దపోలు నాగవర్ధన్‌పై మిస్సింగ్ కేసు ఆచూకీ లభ్యమైనది. బుధవారం హాస్టల్ నుండి ఎవరికి సమాచారం ఇవ్వకుండా పరారై కరీం నగర్ బస్టాండ్ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం. సేకరించిన స్థానిక సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో వివిధ కోణాలలో దర్యాప్తు నిర్వహించి కరీంనగర్ పోలీసులకు సమాచారం అందజేసి విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా స్థానిక పోలీసులు హుటాహుటిన కరీంనగర్‌కు వెళ్లి విద్యార్థిని చెన్నూరు తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాగవర్ధన్‌ను క్షేమంగా అప్పగించిన పోలీసులకు విద్యార్థి కుటుంబ సభ్యులు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో ఎంతో సంచలనంగా మారిన మిస్సింగ్ కేసు ఎట్టకేలకు సుఖాంతంగా ముగియడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై శ్యామ్ పటేల్, సుబ్బారావులు పాల్గొన్నారు.



## మహిళల భద్రత కోసం షీ టీమ్స్

**తాండూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)** మహిళల భద్రత కోసమే షీ టీమ్స్ పనిచేస్తున్నాయని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై ఉషారాణి అన్నారు. మండలంలోని రేచిని జడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు డ్రగ్స్, షీ టీమ్ మీద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా చట్టాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్ధాలు, షీ టీమ్ ప్రాముఖ్యత , మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు దాని పరిణామాల గురించి, ఈవ్ టీజింగ్, టీ సేఫ్ అప్లికేషన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్స్, సైబర్ హెల్ప్ లైన్ నంబర్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజ రుగ్మతల గురించి వివరించారు. ఎవరైనా మహిళలను వేధించినా, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 , రామగుండం షీ టీమ్ నెంబర్ 6303923700కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షీ టీమ్ కానిస్టేబుల్స్ శ్రవణ్, జ్యోతి, పాఠశాల హెడ్ మాస్టర్ ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని

## కలిసిన మున్సిపల్ చైర్మన్

**ముథోల్, మార్చి 5 (ప్రభాత సమాచారం)** ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ వెంట మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి వెళ్లి పలువురు ప్రముఖులను కలిశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్రరావ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తో మర్యాద పూర్వక భేటీ కావడంతో మున్సిపల్ చైర్మన్‌ను వారు శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు.. అనంతరం మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ శ్రీదేవి ని కలిశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కుమారుడి వివాహ వేడుకలకు హాజరయ్యారు.. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌లు భైంసా పట్టణ అభివృద్ధికి కావాల్సిన నిధులు, ఇతర అంశాలను మంత్రులకు వివరించారు.. మున్సిపల్ చైర్మన్ హోదాలో మెదటిసారి దత్తాత్రి ఎమ్మెల్యేతో వెళ్లి పలువురిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.



## చైన్ స్నాచింగ్ కేసును

# ఛేదించిన పోలీసులు

**రామకృష్ణాపూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 2వ తేదీన సోమవారం గజాంగి శ్రావణి(27) గోదావరిఖని చెందిన మహిళా మెడలో నుండి స్థానిక సింగరేణి ఏరియా హాస్పిటల్ వద్ద బంగారు పూస్తేలతాడు, సెల్ ఫోన్ దొంగతనం జరగగా.. పట్టణ ఎస్సై శ్రీధర్ కేసు నమోదు చేయడం జరిగింది. వృత్తి రీత్యా ప్రైవేట్ ఉద్యోగిని అయిన శ్రావణికి లాస్య అనే మహిళతో పరిచయం కాగా.. మాటలతో శ్రావణిని మభ్యపెట్టి లాస్య రామకృష్ణాపూర్ కి తీసుకొచ్చింది. ఈ సమయంలోనే శ్రావణి మూత్ర విసర్జనకి అని చెట్ల పొదలోకి వెళ్లగా.. వెనకాల వెళ్ళినా లాస్య శ్రావణిని కిందకు తోసి మెడలో నుండి బంగారు పుస్తెల తాడు, మొబైల్ ఫోన్ లాక్కొని శ్రీరాంపూర్ వైపు వెళ్ళే ఆటోలో ఎక్కి పారిపోయింది.

**దొంగతనం చేసిన సొత్తును రికవరీ..**

బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షణలో మందమర్రి సీఐ పర్సా రమేష్ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ పోలీస్ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు పరిశీలించి, గమనించి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిందితురాలు శ్రీరాంభట్ల మనస్వినీ అలియాస్ లాస్య, అలియాస్ అనూష (22) సిసిసి శ్రీరాంపూర్ నివాసినిగా గుర్తించారు. జల్సాలకు అలవాటు పడి భర్తను, కొడుకుని వదిలి మంచిర్యాలలో ప్రస్తుతం ఉంటున్న నిందితురాలిని గురువారం మధ్యాహ్నం రోజు మంచిర్యాల ముఖారం చౌరాస్తా వద్ద దోచిన సొత్తును అమ్ముతుండగా.. పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ నిందుతురాలిని చాకచక్యంగా పట్టుకుని దొంగతనం చేసిన సొత్తును రికవరీ చేశాడు. ఈ కేసును ఇంత త్వరగా ఛేధించిన రామకృష్ణాపూర్ ఎస్సై జాడి శ్రీధర్‌ను మందమర్రి సీఐ రమేష్ అభినందిస్తూ సిబ్బందికి రివార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్శ రమేష్ , రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.




## కలెక్టర్‌ను కలిసిన

## టిజిఎండిసి జిల్లా ప్రాజెక్ట్ అధికారి

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)** తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టి.జి.ఎం.డి.సి) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాజెక్ట్ అధికారిగా వెంకటేశ్వర్లు గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.







### ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక
# పకడ్బందీగా అమలు చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా రూపొందించి పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో 99 రోజుల ప్రణాళిక రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి సెంటర్లలో పోషణ ప్రణాళిక అమలు, డ్రాప్ అవుట్ పిల్లలను తిరిగి తీసుకురావడం, సామ్, మామ్ పిల్లల గుర్తింపు, సఖి సంబంధిత అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగల, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు వారి ఆధ్వర్యంలోని సంక్షేమ వసతి గృహాలలో పారిశుద్ధ్యం, ఉపకార వేతనాలు, డైట్ చార్జీల పెంపుపై అవగాహన కల్పించడం, పిల్లల హాజరు శాతం పెంచడం, ఆయా శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పథకాలపై అవగాహన కల్పించడం, లబ్ధిదారులను గుర్తించడం అంశాలపై కార్యచరణ రూపొందించాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నూతన సబ్ స్టేషన్‌ల ఏర్పాటు, గృహ జ్యోతి పథకం అమలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ గుర్తింపు, సందర్శన, భూసార ఆరోగ్య కార్డు, పంట మార్పిడి, సోలార్ పంపుల ఏర్పాటు, రైతులతో శాస్త్రవేత్తల సమావేశం, పప్పుధాన్యాల పంటలను ప్రోత్సహించడం వంటి అంశాలపై ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిశు మరణాల నియంత్రణ, ఆసుపత్రులలో ప్రసవాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, బస్తీ దవాఖానలు, పాఠశాలల సందర్శన, ప్రభుత్వ వైద్యశాలలు, నాణ్యత ప్రమాణాలు పెంపొందించడం, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, డ్రగ్ కంట్రోల్ రెగ్యులేటరీ, డిజిటల్ హెల్త్ కార్డ్స్ జారీ చేయడం, హెచ్ పి వి వ్యాక్సినేషన్ తదితర అంశాలపై పకడ్బందీగా కార్యచరణ రూపొందించాలని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీరు, పన్నుల వసూలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ వంటి అంశాలు, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కూలీల నిర్వహణ, మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, మూత్రశాలలు, కిచెన్ షెడ్ల నిర్మాణం, ప్లాంటేషన్ ప్రోగ్రాం, సామాజిక ఇంకుడు గుంతల నిర్వహణ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పేరెంట్ టీచర్ సమన్వయ సమావేశం, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల పురోగతి, మండల స్థాయిలో సౌకర్యాల కల్పన తదితర అంశాలపై కార్యచరణ రూపొందించాలని తెలిపారు. గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో కంటిచూపు పరీక్షలు నిర్వహణ, ఎక్కువ సంఖ్యలో వాహనాలు ఆగే ప్రదేశాలలో డ్రైవర్లకు అవగాహన కల్పించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠినంగా వ్యవహరించడం, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం, జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేయబడిన నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వివరాలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డుల వారిగా వివరాలతో సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా అధికారులు తమ పరిధిలోని కార్యాలయంలో, కార్యాలయాల పరిసరాలలో పారిశుధ్యం నిర్వహణ, పెండింగ్ లో ఉన్న ఫైల్స్ క్లియర్ చేయడం వంటి వాటిని పూర్తి చేయాలని, అంతర్గత సమావేశాలు నిర్వహించి 99 రోజుల ప్రణాళిక తయారు చేసి, పక్కాగా అమలు అయ్యేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించాలి

**జూమ్ మీటింగ్‌లో సమీక్షించిన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని పది అంశాలపై జిల్లాలో ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని కలెక్టర్ కెహరిత అన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచ రణపై కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలపై ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణపై వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ఈ 99 రోజుల కార్యక్రమం ప్రధానంగా 10 అంశాలపై కొనసాగుతుందని తెలిపారు. మార్చి 6 నుంచి 15 వరకు గ్రామాలలో మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యక్రమాలలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పెండింగ్ ఫైళ్ల పరిష్కార కార్యక్రమం చేపట్టాలన్నారు. మార్చి 8వ ప్రపంచ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారి భాగస్వామ్యంతో 99 రోజుల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, రహదారి భద్రతలో భాగంగా అరైవ్- అలైవ్ కార్యక్రమం, సంక్షేమం, పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్యా, యువత, క్రీడలు, మహిళల సంక్షేమం, పర్యావరణంపై కార్యక్ర మాలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## 108, 102 అంబులెన్స్‌ల తనిఖీ

**వాంకిడి, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత శ్రేణి ఆసుపత్రి వద్ద ఉన్న 108, 102 అత్యవసర సేవల అంబులెన్స్‌లను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ స్వామ్రాట్, 108 జిల్లా మేనేజర్ మెరుగు నరేష్ యాదవ్ గురువారం ఆకస్మి కంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లలో ఉన్న మెడికల్ స్టాక్, వైద్య పరి కరాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. వేసవికాలంలో వడదెబ్బ కేసులు పెరిగే అవ కాశం ఉన్నందున అన్ని అంబు లెన్స్‌లలో డ్రగ్ చిల్లర్లు, ఐస్ ప్యాక్‌లు సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే 102 అంబులెన్స్ ద్వారా మండల ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అత్యవసర కాల్ వచ్చిన వెంటనే అంబులె న్స్ ఆలస్యం చేయకుండా వెంటనే బయలు దేరేలా అప్రమత్తంగా ఉండాల ని సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో 108 మెడికల్ టెక్నీషియన్లు ప్రవీణ్, అమృత రావు, పైలెట్లు భీమ్రావు, రమేష్, 102 అంబు లెన్స్ పైలెట్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేయవద్దు

**ఖానాపూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని కాలనీలో రోడ్లపై చెత్త వేయద్దని, మున్సిపల్ వాహనంలో మాత్రమే చెత్త వేసి ప్రజలు సహకరించాలని ఖానాపూర్ 11వ వార్డు కౌన్సిలర్ రాజురా సత్యం, కమిషనర్ సుందర్ సింగ్ అన్నారు. గురువారం ఖానాపూర్ మున్సిపాలిటీలోని 11వ వార్డ్ లో అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ మేరకు పలు రోడ్లపై మురికి నీళ్లు పారుతున్నాయని, చెత్తాచెదారం డ్రైనేజీలో వేయడంతో మురికి నీరు పోయేందుకు దారి లేక డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయని, ప్రజలు సహకరించాలని వారు కోరారు. వీరితో పాటు శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఉప్పరి పోశెట్టి, సిబ్బంది తదితరులు ఉన్నారు.





## అదనపు కట్నం వేధింపులు

**లక్షెట్టిపేట, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

మోదెల గ్రామానికి చెందిన మంచాల కవిత, తన భర్త మంచాల సుధాకర్ అదనపు కట్నం తేవాలని మద్యం సేవించి వచ్చి కొట్టడంతో పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం బాధితురాలు కవితకు సుధాకర్ 2009లో వివాహం కాగా ఒక 10 సంవత్సరాల పాప కూడా ఉంది. పెళ్లయిన సంవత్సరం నుండి సుధాకర్ తరచూ మద్యానికి అలవాటు పడి భార్యను కొట్టగా.. పెద్ద మనుషుల సమక్షంలో పలు మార్లు పంచాయతీ పెట్టిన సుధాకర్ కొట్టనని చెబుతూ.. మద్యం తాగనని చెబుతూ, కూడా తరచూ తన ప్రవర్తన మార్చుకోలేదు. బుధవారం రాత్రి అతిగా మద్యం తాగి వచ్చి తన ఇంటి వద్ద భార్యను అదనంగా 60 వేల రూపాయల కట్నం తేవాలంటూ బూతులు తిడుతూ.. కొట్టడంతో ఆమె ప్రైవేట్ హాస్పిటలో అడ్మిట్ అయ్యారు. సమాచారం అందుకున్న ఎస్సై సురేష్ బాధితురాలు దగ్గరికి వెళ్లి చికిత్స పొందుతున్న ఆమెను వివరాలు అడిగి తెలుసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితురాలికి న్యాయం జరుగుతుందన్నారు.

# చెన్నూరు రాజకీయాల్లో ముదిరిన సెగలు

**బాల్క సుమన్ అరెస్ట్.. కాంగ్రెస్‌కు లాభమా? నష్టమా?**

**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాజకీయాల్లో దూకుడుగా ఉండే నేతల్లో ఒకరైన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్ మరియు ఇటీవలి విడుదల రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఈ పరిణామం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై గట్టి ప్రభావం చూపనుంది.

**అరెస్ట్ నుండి విడుదల వరకు...**

ఫిబ్రవరి 17, 2026న క్యాతనపల్లి మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం తర్వాత కొత్త చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై దాడి జరిగిందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా బాల్క సుమన్‌ను ఫిబ్రవరి 18న పోలీసులు అరెస్ట్ చేశారు. రిమాండ్డా దాపు రెండు వారాల పాటు ఆదిలాబాద్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఆయనకు మార్చి 2న కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మార్చి 4, 2026 ఆయన జైలు నుండి విడుదలయ్యారు.

**కాంగ్రెస్ పార్టీకి కలిగే పరిణామాలు...**

బాల్క సుమన్ అరెస్ట్ వ్యవహారం అధికార కాంగ్రెస్ పార్టీకి రెండు వైపులా పదునున్న కత్తిలా మారింది. కాంగ్రెస్‌కు కలిగే లాభాలు అధికార పట్టున్న ప్రాంతాల్లో బీఆర్ఎస్ నేతల దూకుడుకు బ్రేక్ వేయడం ద్వారా, ప్రభుత్వం తన పట్టును నిరూపించుకుంది. చట్టం ఎవరికైనా ఒక్కటేననే సంకేతం పంపింది. ఈ గందరగోళ పరిస్థితుల మధ్యే క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఆ పార్టీకి పెద్ద రాజకీయ విజయం. కేడర్ జోష్ బలమైన ప్రతిపక్ష నేతను జైలుకు పంపడం ద్వారా స్థానిక కాంగ్రెస్ నాయకుల్లో, కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది.



**రాజకీయ కక్షసాధింపు ముద్ర...**

ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ఖూనీ చేస్తోంది" అనే బీఆర్ఎస్ విమర్శలు ప్రజల్లోకి వెళ్తున్నాయి. ముఖ్యంగా ఒక దళిత నేతను కావాలనే ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారం కాంగ్రెస్‌కు మైనస్ కావచ్చు సానుభూతి పవనాలు... బాల్క సుమన్ విడుదలయ్యాక తన కుమారుడి పుట్టినరోజున జైల్లో ఉంచారని భావోద్వేగంగా మాట్లాడటం సామాన్య ప్రజల్లో సానుభూతిని కలిగించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ ఐక్యత ఈ అరెస్ట్ వల్ల చెల్లాచెదురైన బీఆర్ఎస్ శ్రేణులు మళ్లీ ఏకమయ్యాయి. ఇది రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి పోటీనిచ్చే ప్రమాదం ఉంది.

**భవిష్యత్త జిల్లా రాజకీయాలపై ప్రభావం..**

బాల్క సుమన్ అరెస్ట్ వల్ల తాత్కాలికంగా కాంగ్రెస్ మున్సిపాలిటీని గెలుచుకున్నా, దీర్ఘకాలికంగా ఇది సానుభూతి వర్సెస్ అధికారం"అనే పోరాటంగా మారింది. ముఖ్యంగా సింగరేణి బెల్ట్ ప్రాంతంలో ఈ అరెస్ట్ ప్రభావం ఓటింగ్ సరళిని మార్చే అవకాశం ఉంది.



## పట్టణ వాసులకు మెరుగైన
# మౌలిక సదుపాయాలు కల్పించాలి

పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి
నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
38వ వార్డులో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై కలెక్టర్ ఆరా..
అధికారులకు కీలక ఆదేశాలు
వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టండి
ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించాలి
అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం..





**నిర్మల్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

పట్టణ వాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నిర్మల్ పట్టణంలోని బుధవార్‌పేట్ 38 వ వార్డులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పలు వీధుల గుండా తిరుగుతూ, రోజువారీగా సాగుతున్న పారిశుద్ధ్య పనులు, తాగునీటి వసతి, తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయో స్వయంగా పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ, వారికి రోజు తాగునీరు అందుతుందో లేదో, పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారో లేదో వారిని అడిగి తెలుసుకున్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయేమో అని అడిగారు. ఇండ్లలో తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి, చెత్త వాహనాలకు అందివ్వాలని పేర్కొన్నారు. చెత్తను బయట పారివేయరాదని సూచించారు. ఎవరికైనా సమస్యలు కలిగితే వెంటనే అధికారుల, కౌన్సిలర్ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అధికారులతో మాట్లాడుతూ, ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ మెరుగైన మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లు దృష్టికి వస్తే వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. వేసవికాలం ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా చెత్త వాహనాలను అన్ని వీధులలోకి తీసుకురావాలని వివరించారు. ప్రతిరోజు సమయానికి త్రాగునీరు సరఫరా చేయాలని తెలిపారు. అవసరమైన చోట డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మిస్తూ, అవసరమైన వాటికి మరమ్మతులు చేయాలని చెప్పారు. డ్రైనేజీలలో తీసిన పూడికల చెత్తను ఎప్పటికప్పుడు తీసివేయాలని తెలిపారు. ఈ వార్డు పర్యటనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, తహసిల్దార్ రాజు, వార్డు కౌన్సిలర్ నాందేడపు అన్నపూర్ణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దినసరి కార్మికులకు కూలి రేట్లు పెంచాలి

**నిర్మల్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలో వ్యాపార సముదాయాలు పనిచేస్తున్న దినసరి కూలీలకు కార్మికులకు రేట్లు పెంచాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. గురువారం సమావేశం నిర్వహించి సంఘ నాయకులు విలాస్ రమేష్ మాట్లాడారు. పట్టణంలో సుమారు 3000 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారికి సమన పనికి సమన వేతనం ఇవ్వాలని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆ ఓనర్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని. కార్మికులుగా కాకుండా మనుషులుగా చూడాలని ఆయా విధులలో వారి గౌరవానికి భంగం కలిగే విధంగా ఉండకూడదని వారికి న్యాయబద్ధంగా వచ్చే వారికి వేతనాలు చెల్లించాలని 2026 సంవత్సర ప్రకారం ఒక్కొక్క కార్మికునికి రూపాయలు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం ఎన్నిక జిల్లాగౌరవ అధ్యక్షులు గా భూక్యా రమేష్. జిల్లా అధ్యక్షులు. చీ. రాజేశ్వర్. జిల్లా కార్యదర్శి. శివకుమార్. జిల్లా ఉపాధ్యక్షులు ముత్తన్న కోశాధికారి. శ్రీనివాస్ ఎన్నుకోవడం జరిగింది..ఈ కార్యక్రమం లో సిపిఐ సినియర్ నాయకులు ంఅ రెడ్డి.



నారాయణ తదితరులు పాల్గొన్నారు.




## ఆత్మవిశ్వాసంతో
# పరీక్షలు రాయాలి

**కాగజ్‌నగర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల హాల్ టికెట్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి ఏసిఎంఓ ఉద్ధవ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసం గించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని విడిచి ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఎలాంటి అపోహలకు లోను కాకుండా క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదువుతూ మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మోటివేషనల్ స్పీకర్ సుందిల రమేష్ మాట్లాడుతూ, నిరంతర సాధన, సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, సెల్ ఫోన్ మరియు సినిమాల ప్రభావం తగ్గించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోజుకు కనీసం ఎనిమిది గంటల నిద్ర, శారీరక వ్యాయామం, మానసిక స్థైర్యం జీవితంలో విజయానికి దారితీస్తాయని వివరించారు. విద్యార్థుల బలాలు, బలహీనతలు, అవకాశాలు, అవరోధాలను గుర్తించి వాటిని ఎలా ఎదుర్కోవాలో ప్రాయోగికంగా తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మాట్లాడుతూ, విద్య ఒక్కటే విద్యార్థుల భవిష్యత్తును మార్చగలదని పేర్కొన్నారు. మంచి ఫలితాలు సాధించి జిల్లాను ముందువరుసలో నిలపాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, ప్రీతి, భారతి, ఎస్. ధర్మరావు, పీడీ రాజేంద్ర ప్రసాద్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీడీ కార్మికులకు పెన్షన్ పెంచాలి

**నిర్మల్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రభుత్వం బీడీ కార్మికులకు ఎన్నికల హామీలు ఇచ్చిన పెన్షన్ పెంచే ఆమెని వెంటనే అమలు చేయాలని సిఐటి జిల్లా కార్యదర్శి సురేష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు బీడీ కార్మికుల ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం బీడీ కార్మికులకు 4 016 రూపాయల పెన్షన్ ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చిందని వెంటనే అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేస్తారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంగాధర్ లక్ష్మి, బేగం తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి అవకాశాలపై అవగాహన

**సారంగాపూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

సారంగాపూర్ మండలంలోని చించోలి(బి)గ్రామంలో గల మహిళా ప్రాంగణంలో ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి పథకంపై అవగాహన కార్యక్రమం ఎంటర్‌ప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ సెంటర్, నిర్మల్ ద్వారా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఐాఔజణజ విజయలక్ష్మిలు హాజరై పథకాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. యువత ప్రభుత్వ పథకాలను వినియోగించు కుని స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. వ్యాపార అభివృద్ధి, వ్యాపార ప్రణాళిక మరియు ఎంటర్‌ప్రెన్యూర్షిప్ నైపుణ్యాలపై పాల్గొనేవారికి మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జుణజ మేనేజర్ శ్రీ అభినయ్ దీప్, అసిస్టెంట్ మేనేజర్ తేజేశ్వి పాల్గొన్నారు.





# కలెక్టర్‌ను కలిసిన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్నారని, మరింత అభివృద్ధికి కృషి చేయాలని సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కోరారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో సమితి సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. హోలీ పండుగ సంప్రదాయం ప్రకారం చక్కెర బిళ్లల హారం, గులాబీ పూలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమితి ఆధ్వర్యంలో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను మరింతగా నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలని కలెక్టర్ సూచించినట్లు సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రేణిగుంట రవీందర్, సమానపల్లి నర్సింలు, మీసాల స్వామి, మామిడి రాజు, కిషన్, అశోక్ రెడ్డి, ఉరాడే సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యం కోసం ప్రతి విద్యార్థి శ్రమించాలి

## ఆశ్రమ పాఠశాల విద్యార్థుల కోసం ఇగ్నైట్ యువర్ డ్రీమ్స్ అమలు
## ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మట్







**ఉట్నూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు ఉన్నత లక్ష్యం దృష్టిలో పెట్టుకుని శ్రమించి ఉన్నత విద్యావంతులు కావాలని ఐటిడిఏ పిఓ యువరాజ్ మార్మట్ అన్నారు గురువారం ఉట్నూరులోని పి ఎ ఆర్ సి లో ఇగ్నైట్ యువర్ డ్రీమ్స్.. మోటివేషన్ మరియు కెరియర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలోని ఒక్క 124 గిరిజన బాలల బాలికల ఆశ్రమ పాఠశాలలతో పాటు గిరిజన వసతి గృహాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.. పదో తరగతి పరీక్షలలో ఫస్ట్ గ్రేడ్ లో ఉత్తీర్ణ సాధించి.. పదో తరగతి తర్వాత కోర్సులు ఉంటాయి.. ఉద్యోగ అవకాశాలు, లక్ష్యం ఏర్పరుచుకోవాలో.. సాధన ఏ విధంగా చేయాలనే మార్గాలను వివరించేందుకు ఇగ్నైట్ మరియు యువర్ డ్రీమ్స్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని గుర్తించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని పిఓ అన్నారు.. ఈ సందర్భంగా ఉద్యోగులచే మోటివేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు.. జిల్లా అదనపు ఎస్పీ మౌనిక మాట్లాడుతూ.. పదో తరగతి చదువుతున్నప్పటి నుండి ఉన్నత లక్ష్యంతో ఏకాగ్రతతో చదివితే ఉన్నత లక్ష్యం ను చేరుకుంటామని అన్నారు.. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి డాక్టర్ కుడిమేత మనోహర్ , ఐటిడిఏ విద్యాశాఖ డిప్యూటీ డిఇఓ గోడం చందన్, ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఈ ఈ శివ ప్రసాద్, న్యాయవాది జగన్, హెచ్ఎం ప్రకాష్ రాథోడ్ లతో పాటు జిల్లాలోని వివిధ ఆశ్రమ పాఠశాల బాలికలు పాల్గొన్నారు.



# పరీక్షలు అంటే భయం వీడాలి

**నిర్మల్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు పరీక్షలు అంటే భయం వీడాలని ప్రొఫెసర్ మధు అన్నారు. గురువారం మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి నివారణ మంచి మార్కులు ఎలా సాధించవచ్చు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి, ఎక్కువ మార్కులు సాధించాలంటే ఏ విధంగా వ్రాయాలి అనే అంశాల పై వివరించారు. అదే విధంగా పరీక్ష పత్రాన్ని క్షుణ్ణంగా మూడు సార్లు చదివి జవాబులు వ్రాయడానికి సిద్ధం కావాలని చెప్పారు.. ఈ సమయంలో శాఖాహార మిత భోజనం చేయాలని కోరారు. ఇంకా అనేక రకాల సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయులు చట్ల శ్రీనివాస్, సురేందర్, మోరే శ్రీనివాస్, మసియుద్దీన్, ఆశా కిరణ్,విద్యారాణి, ముత్తన్న, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరికి బాధ్యత








**మంచిర్యాల, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ ప్రాంతంలో గల 32వ డివిజన్ లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్ డిప్యూటీ మేయర్ చల్లా రమ్య లతో కలిసి మంచిర్యాల శుభ్రత - ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు మంజూరు చేయడం జరిగిందని, వచ్చే 99 రోజులలో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసే విధంగా కార్యచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో మాత్రమే కాకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, పారిశుధ్య మాత్రమే కాకుండా ఆ ఏ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న జనన, మరణ, భవన నిర్మాణ, ఇతర ధ్రువపత్రాలకు సంబంధించి ఫైళ్ళ క్లియరెన్స్ కొరకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులను, ప్రజలను భాగస్వామ్యం చేసుకుంటూ పనులను పూర్తి చేయాలని తెలిపారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ ప్రతి ఇంటింటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, ఉపయోగకరమైన చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహాలు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలలో చెత్తను రోడ్డుపై, మురుగు కాలువలలో వేసినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేయడం, వీధి దీపాల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నట్లయితే కార్యక్రమం విజయవంతం అవుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో శుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మాట్లాడుతూ శుభ్రత కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరుగుతుందని, మున్సిపల్, విద్యుత్, త్రాగునీరు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ముందు రోజు డివిజన్లో పర్యటించి నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నస్పూర్ మండలం తీగల్ పహాడ్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలో ఓటింగ్ యంత్రాల గోదామును జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరావు దేశ్ పాండే, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు.

# కేజీబీవీలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**నిర్మల్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో అమలవుతున్న '99 రోజుల ప్రత్యేక ప్రణాళిక' క్షేత్రస్థాయి అమలును కలెక్టర్ అభిలాష అభినవ్ స్వయంగా పర్యవేక్షించారు. ఇందులో భాగంగా గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలకు చేరుకున్న కలెక్టర్, విద్యార్థులతో కలిసి ఉదయపు అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలలోని మెస్ నిర్వహణను పరిశీలించి, విద్యార్థులకు వడ్డిస్తున్న అల్పాహారం నాణ్యతను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ..**
ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి సంభాషించి, వారికి అందుతున్న వసతులు, విద్యా బోధన, ఇతర సమస్యలపై ఆరా తీశారు. ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా, సమయపాలన పాటించకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ రాజు, అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# వారం ముందే 'ఉస్తాద్'



మెగాస్టార్ చిరంజీవి తమ్ముడిగా సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన పవన్ కళ్యాణ్.. అతి తక్కువ సమయంలోనే పాన్ ఇండియా వైడ్ గుర్తింపు సొంతం చేసుకున్నారు. తన మేనరిజంతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న పవన్ కళ్యాణ్.. ప్రస్తుతం 10 సంవత్సరాల రాజకీయ పోరాటం తర్వాత ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ కి డీసీఎం గా బాధ్యతలు చేపట్టి.. ఇటు నాయకుడిగా, అటు సినిమా హీరోగా రెండు పడవల మీద ప్రయాణాన్ని చక్కగా బ్యాలెన్స్ చేసుకుంటూ దూసుకుపోతున్నారు.ఈ క్రమంలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత జ్యోతి కృష్ణ దర్శకత్వంలో 'హరిహర వీరమల్లు' సినిమా చేసి పర్వాలేదనిపించుకున్న ఈయన సాహో డైరెక్టర్ సుజిత్ దర్శకత్వంలో 'ఓజీ' సినిమా చేసి రికార్డులు క్రియేట్ చేశారు. ప్రస్తుతం గబ్బర్ సింగ్ తర్వాత మళ్లీ ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. మార్చి 26వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించినప్పటికీ.. వారం ముందే అనగా మార్చి 19వ తేదీన ఈ సినిమాను విడుదల చేస్తున్నామని అధికారికంగా ప్రకటించారు. ఇక దీంతో ఈ విషయం కాస్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.వారం ముందే ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫిలిమ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో నిర్మాతలు ఈ రిలీజ్ డేట్ ను మార్చడం వెనుక అసలు విషయం తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ముఖ్యంగా సినిమాకి మొదటి షో హిట్ టాక్ గనక లభించినట్లయితే.. ఈ చిత్రంనిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తుంది అనడంలో సందేహం లేదు అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఏ హీరో అయినా సరే తమ సినిమాను విడుదల చేసేటప్పుడు కచ్చితంగా హాలిడేస్ ను పరిగణలోకి తీసుకొని మరీ తమ సినిమాను విడుదల చేస్తారు. అయితే ఇక్కడ ఉస్తాద్ కోసం మేకర్స్ తీసుకున్న నిర్ణయానికి ఏకంగా 10 రోజులు కలిసి రావడం ఎవరు ఊహించని పరిణామం. అసలు విషయంలోకి వెళ్తే.. మార్చి 19వ తేదీన ఈ సినిమా రాబోతోంది.. కాబట్టి మార్చి 18న ఈ సినిమా ప్రీమియర్స్ స్టార్ట్ అవుతాయి.. ఇక మార్చి 19వ తేదీ గురువారం ఉగాది పండుగ .. మార్చి 20 శుక్రవారం రంజాన్.. మార్చి 21 శనివారం కాగా , మార్చి 22 ఆదివారం . ఇక మార్చి 27వ తేదీ శ్రీరామనవమి , మార్చి 28 శనివారం, మార్చి 29 ఆదివారం, ఏప్రిల్ 3 గుడ్ ఫ్రైడే, ఏప్రిల్ 4, 5 వీకెండ్స్ కావడం ఇలా మొత్తం పది రోజులు ఈ సినిమాకి కలిసి రావడం గమనార్హం ఏది ఏమైనా ఒక్క విడుదల తేదీని మార్చడంతో ఇన్ని సెలవు దినాలను ఈ నిర్మాతలు క్యాష్ చేసుకోబోతున్నారనే చెప్పాలి. ముఖ్యంగా పాజిటివ్ టాక్ వస్తేనే ఈ సెలవు దినాలలో ఈ సినిమాకి కలెక్షన్స్ భారీగా వస్తాయనేది గమనించదగ్గ విషయం.. మరి చూద్దాం భారీ అంచనాల మధ్య వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ ఫస్ట్ షో ఎలాంటి టాక్ సొంతం చేసుకుంటుందో.

# పెళ్లి పీటలెక్కనున్న పూజా హెగ్డే?

బుట్టబొమ్మ పూజాహెగ్డే వృత్తిగత జీవితం గురించి చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్ నుంచి సౌత్ కి మళ్లీ కంబ్యాక్ అయిన తర్వాత ఒక్కొక్కటిగా అవకాశాలు అందుకుంటుంది. టాలీవుడ్ పక్కన బెట్టినా కోలీవుడ్ మాత్రం అక్కున చేర్చుకుని ఆదరిస్తుంది. ఈ క్రమంలోనే పూజాహెగ్డే పేరు మీడియాలో వైరల్ అవుతుంది. లేదంటే? అమ్మడు పేరు కనుమరుగైపోయేది. కోలీవుడ్ అవకాశాలతో మెల్లగా మళ్లీ టాలీవుడ్ లోనూ బిజీ అవ్వాలని చేయని ప్రయత్నం లేదు. పాత పరిచయాలతో మళ్లీ అవకాశాలు అందుకునే చర్యలు చేపట్టింది. ఇదంతా ప్రొఫెషనల్ లైఫ్.మరి అమ్మడి వ్యక్తిగత జీవితం ఎలా ఉంది? అంటే ఓ ఇంట్రెస్టింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. పూజాహెగ్డే కి తల్లిదండ్రులు పెళ్లి కొడుకుని వెతికే పనిలో పడ్డట్లు తెలుస్తోంది. అమ్మడి వయసు ఇప్పటికే 35 ఏళ్లు నిండటంతో పెళ్లి చేసుకోమని ఇంట్లో తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారుట. కొన్ని నెలలలుగా ఈ ఒత్తిడి మొదలైన నేపథ్యంలో తాజాగా పెళ్లి విషయంలో సంబంధాలు చూడండని చెప్పిందిట. డాడ్ మంజునాథ్ హెగ్డే..మామ్ లతా హెగ్డే ఓ పెద్ద వ్యాపారవేత్త కుటుంబం నుండి సంబంధాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ముంబైకి చెందిన బిజినెస్‌మెన్‌తో ఆమె పెళ్లి ఉండవచ్చని వార్తలొస్తున్నాయి.మరి ఈ ప్రచారంలో నిజానిజాలు తేలాల్సి ఉంది. పూజాహెగ్డే మనసులో ఎవరైనా ఉన్నారా? లవ్..రిలేషన్ షిప్ అంటూ కొందరి పేర్లు గతంలోనే తెరపైకి వచ్చాయి. దివంగత నటుడు నవినోద్ మెహ్రా కుమారుడు, నటుడు రోహన్ మెహ్రా సన్నిహితంగా ఉంటుందనే ప్రచారం జరిగింది. వీరిద్దరూ పలుమార్లు ముంబైలో కెమెరా కంటికి చిక్కారు. 2024 ఏప్రిల్‌లో పూజా తల్లిదండ్రులతో కలిసి రోహన్ లంచ్‌కు వెళ్లడం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. అటుపై `కిసీకా భాయ్ కిసీకా జాన్` షూటింగ్ సమయంలో సల్మాన్ ఖాన్ తోనూ ప్రేమలో ఉందనే ప్రచారం జరిగింది.పూజాహెగ్డే సోదరుడు రిషబ్ హెగ్డే పెళ్లికి సల్మాన్ అటెండ్ అవ్వడం అప్పట్లో చర్చనీయాంశం అయింది.



# 'ఈటీవీ విన్' క్రేజీ ప్యాకేజీ!

"పండగ వాతావరణంతో కనిపిస్తున్న ఈ సినిమా అందరినీ నవ్వులతో అలరిస్తుందని నమ్ముతున్నా" అన్నారు ప్రముఖ నటుడు బ్రహ్మానందం. ఆయన, నిర్మాత బండ్ల గణేశ్ ముఖ్య అతిథులుగా ఇటీవల హైదరాబాద్‌లో 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. శివాజీ కథానాయకుడిగా నటిస్తూ, స్వయంగా నిర్మించిన చిత్రమిది. లయ ముఖ□◌్యభూమిక పోషించారు. సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. ఈటీవీ విన్‌తో కలిసి బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ఈ నెల 6న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. వేడుకని ఉద్దేశించి బ్రహ్మానందం మాట్లాడుతూ "యువకులంతా కలిసి ఓ మంచి సినిమాని చేశారు. తప్పకుండా ఈ చిత్రం ప్రేక్షకుల్ని మెప్పించాలి, శివాజీ నిర్మాతగా విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. బండ్ల గణేశ్ మాట్లాడుతూ "ఈటీవీ విన్ సంస్థ కొత్త ప్రతిభని ప్రోత్సహిస్తోంది. శివాజీ నిర్మించిన ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. శివాజీ మాట్లాడుతూ "ఈటీవీ విన్ నుంచి వస్తున్న సినిమా అంటే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. ఈ సినిమా విషయంలోనూ అదే కనిపిస్తోంది. ప్రేక్షకుడికి సినిమా దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈటీవీ విన్ సంస్థ ఫ్యామిలీ ప్యాకేజ్‌ని ప్రకటించింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.499కి నాలుగు టికెట్లతోపాటు, ఓ పాప్‌కార్న్ ఇస్తోంది. మల్టీప్లెక్స్‌ల్లో రూ.799కి నాలుగు టికెట్లు ఓ పెద్ద పాప్‌కార్న్‌ని ఈ ప్యాకేజీలో భాగంగా అందిస్తారు. కుటుంబ ప్రేక్షకులు, స్నేహితుల్ని దృష్టిలో ఉంచుకునే ఈ సినిమాతో ఈ ప్యాకేజ్‌ని తీసుకొచ్చింది. కుటుంబమంతా కలిసి హాయిగా ఆస్వాదించే చిత్రమిది" అన్నారు. ఈ కార్యక్రమంలో నటులు లయ, అలీ, ప్రిన్స్, వంశీ నందిపాటి, రిక్కీ, బబ్లూ, రోహన్, షాబుద్దీన్, చిత్రం శ్రీను, కమల్, చమ్మక్‌చంద్ర, ఇమ్మానుయేల్, పృథ్వీ, ఈటీవీ విన్ ప్రతినిధులు నితిన్ చక్రవర్తి, సాయికృష్ణ, ఛాయాగ్రాహకుడు రిత్విక్‌రెడ్డి, ఎడిటర్ బాలు మనోజ్, బోలేషావలి, రచయిత మిథిల్ తదితరులు పాల్గొన్నారు.

# వంతెనలు దాటాలంటేనే 'వణుకు'

**అదిలాబాద్ జిల్లాలో పలు పాత వంతెనలు ప్రమాదకరంగా మారడంతో వాటిపై నుండి ప్రయాణం చేయాలంటేనే ప్రాణసంకటంగా మారుతుంది. శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలు ప్రమాద గంటికలను మోగిస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన, ఇరుకైన వంతెనలతో ఎన్నో ప్రమాదాలు జరిగిన పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇప్పటికే ఎన్నో వంతెనలపై నుండి లారీలు, బస్సులు, కార్లు పడి ప్రమాదాలు జరిగాయి.**



- అదిలాబాద్ రహదారులపై మృత్యుఘంటికలు
- వంతెనల నిర్మాణం.. అగ్రిమెంట్లకే పరిమితం!
- గుడిహత్నూరు - ఉట్నూరు దారిలో కునారిల్లుతున్న పురాతన బ్రిడ్జిలు
- గాల్లో దీపాల్లా ప్రయాణికుల ప్రాణాలు..
- కాంట్రాక్టర్ల పేచీ.. అధికారుల ఒత్తిడి.. వెరసి నిలిచిపోయిన పనులు
- బిల్లులు రావడం లేదంటున్న గుత్తేదారులు
- నిధులు మంజూరైనా అడుగు ముందుకు పడని వైనం
- ప్రాణ సంకటంగా ఉట్నూరు ప్రయాణం

**ఉట్నూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి అయిన గుడిహత్నూర్, ఉట్నూర్ మండలంలోని రహదారిపై దశాబ్దాల క్రితం నిర్మించిన పాత వంతెనలు ప్రయాణికులను, వాహన చోదకులను వణికిస్తున్నాయి. ఈ రహదారిపై పురాతన వంతెనలే దర్శనమిస్తున్నాయి. వందేళ్ల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలా వ్యవస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయి. భారీ వాహనాలతో పాటు బస్సులు ఇతర వాహనాలు వంతెనలు దాటే సమయంలో ఊగుతూ ప్రయాణికులను వన్నికిస్తున్నాయి. పురాతన వంతెనలను తొలగించి కొత్త వంతెన నిర్మించుటకు ఆర్అండ్‌బీ శాఖ ఇంజనీరింగ్ అధికారులు వంతెనల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి 2022-23 సంవత్సరంలో ప్రతిపాదనలు పంపించారు. అధికారులు పంపిన ప్రతిపాదనలకు 9 కోట్లు మంజూరు చేశారు. మంజూరైన నిధులకు అధికారులు టెండర్లు పిలిచారు. టెండర్లు పొందిన గుత్తేదారులు వంతెన పనులు పూర్తి చేస్తామని అగ్రిమెంట్లు సైతం చేసుకున్నారు. ఇద్దరు గుత్తేదారులు తీసుకున్న పను లు నేటికీ ప్రారంభించలేదు. పనులు చేపట్టాలని ఆ శాఖ అధికారులు గుత్తేదారులకు నోటీసులు జారీచేసిన గుత్తేదారులు పనులు ప్రారంభించేందుకు ముందుకు రావడం లేదు. పనులు చేసే ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదని, తిరిగి టెండర్లు వేసి వేరే గుత్తేదారులకు పనులు అప్పగించాలని అధికారులకు జవాబు పంపినట్లు తెలిసింది.

**నాగపూర్ వాగుపై బ్రిడ్జికి 4 కోట్లతో ప్రతిపాదనలు....**

2022 సంవత్సరంలో ఆర్అండ్‌బి శాఖ అధికారులు ఉట్నూర్ మండలం నాగపూర్ వాగుపై కొత్త వంతెన నిర్మించేందుకు రూ. 1.20 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. అధికారులు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మంజూరైన నిధులకు టెండర్లు పిలిచిన, పనులు ప్రారంభం కాలేదు. నిత్యం వేల సంఖ్యలో వాహనాల రహదారిపై రాకపోకలు సాగిస్తాయని, మంజూరైన నిధులతో వంతెన పనులు పూర్తికావని ఆర్ అండ్ బి అధికారులు నిర్ణయానికి వచ్చారు. అధికారులు తిరిగి కొత్త ప్రతిపాదనలు రూ.4 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నుండి నాలుగు కోట్లు మంజూరైతే నాగపూర్ వాగుపై వంతెన పనులు ప్రారంభమవుతాయి.

**గుత్తేదారులు ముందుకు రావడం లేదు**

**నర్సయ్య, ఈఈ ఆర్అండ్‌బీ శాఖ**

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు తమ శాఖ ద్వారా టెండర్లు పిలిచి క్లాస్ వన్ గుత్తేదారులైన ముంతాజ్, కోటేశ్వర్ రెడ్డిలకు పనులు అప్పగించాం. 2023లో పనులు తీసుకున్న గుత్తేదారులు నేటికీ పనులు ప్రారంభించడం లేదు. పనులు పూర్తి చేయాలని గుత్తేదారులపై ఒత్తిడి తీసుకువస్తున్న ప్రభుత్వం నుండి బిల్లులు రావడం లేదని పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు.

**నిర్మాణాలపై శ్రద్ధ చూపని ప్రభుత్వం...**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి మంచిర్యాల, కొమురం భీం జిల్లాలతో పాటు కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఎన్నో వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వంతెనలను పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. 2022-23 ప్రభుత్వం మంజూరు చేసిన తొమ్మిది కోట్లతో పనులు ప్రారంభించవలసి ఉన్న నేటికీ పనులు ప్రారంభం కాలే. గుడియాత్నూర్ నుంచి ఉట్నూర్ రహదారిపై గల వంతెనల వద్ద తరచు ప్రమా దాలు జరుగుతున్న అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని, వచ్చే వర్షాకాలంలోగా వంతెనలు నిర్మించాలి. లేకుంటే వర్షాకాలంలో ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశాలు ఉంటాయి.

**-పూర్కా బాపూరావు, తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు**

## వేసవిలో వాహనం జాగ్రత్త

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

వేసవిలో వాహనాలను ఎండలో పార్కింగ్ చేయ దంతో జరిగే ప్రమాదాలు ముందుగా తెలుసుకోవడంతో పాటు ధన, ప్రాణ నష్టాలు కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో మనకు వడ దెబ్బ తగులకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. ఎండగా అనిపించగానే నీడ ఉన్న ప్రదేశానికి వెంటనే చేరుకుంటాం. ఇలానే మనం వినియోగించుకునే వాహనాలను సైతం ఎల్లప్పుడూ నీడ ఉన్న ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలి. ఇలా చేయడంతో రంగుతో పాటు ఇంధనం ఆవిరి కాదు. వాహనం సురక్షితంగా ఉంటుంది. ఇటీవల మార్కెట్‌లో కొత్తగా వచ్చిన విద్యుత్ బ్యాటరీ వాహనాలు అస్సలు ఎండలో ఉంచకూడదని నీడలో ఉంచాలని చెబుతున్నారు. నిర్లక్ష్యం చేస్తే కొన్ని సందర్భాల్లో ఎలక్ట్రికల్ వాహనాలు కాలి పోయి బుడిదవుతాయని చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలలో ఈ జాగ్రత్తలు పాటిస్తే బాగుటుందని సూచిస్తున్నరు.

**దూర ప్రయాణం వద్దు..**

కొంతమంది బైక్‌లపై దూర ప్రయాణం చేయడానికి ఇష్టపడుతారు. వేసవి కాలంలో ఈ రకం ప్రయాణం చాలా ప్రమాదకరం. రోడ్డుతో పాటు పరిసర ప్రాంతాలు ఎండతో వేడెక్కిపోతాయి. దీంతో బైకల ఇంజిన్, టైర్లు త్వరగా వేడెక్కుతాయి. కొన్ని సందర్భాల్లో టైర్లు పేలిపోయి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లవచ్చు. బైక్‌పైనే వెళ్లాల్సిన సందర్భం వచ్చినప్పుడు మాత్రం మార్గమధ్యలో చల్లటి ప్రదేశాలు చూసుకుని ఆగాలి. ఎండలో వాహనాల ఇంజిన్ ఆయిల్ తొందరగా వేడెక్కి పలుచనవుతుంది. వేసవి కాలం ప్రారంభంలోనే వాహనాల ఇంజిన్ ఆయిల్ మార్చుకోవాలి. ట్యాంక్‌పై మందంగా ఉన్న కవర్‌ను ఏర్పాటు చేసుకోవడంతో పెట్రోల్ ఆవిరి కాకుండా కాపా డుకోవచ్చు. అరిగి ఉన్న టైర్లు, పంక్చర్లు ఉన్న ట్యూ బులు ఉంటే మార్చుకోవాలి. ఎండలో ఎక్కు వ సమయం వాహనాలు ఉంచడంతో రంగు వెలిసి పోవడంతో పాటు వాహన జీవిత కాలం క్రమేపీ తగ్గుతుంది.



# ఎండాకాలం.. ఆహారం ఇలా ఉండాలి!

**ప్రభాత సమాచారం, హెల్త్ డెస్క్:** వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ ఏడాది వేసవికి ముందుగానే భానుడి తాపం మొదలైంది. ఈనెలలోనే వేడి, ఉక్కపోత మరింత పెరగనుంది. మార్చి తొలివారంలోనే ఎండలు, ఉక్కపోత పెరిగే ఛాన్స్ ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిన విషయం తెలిసిందే. ఈవారంలో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందనే సంకేతాలు ఇప్పటికే వచ్చాయి. కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే మరింత ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. కొన్ని చోట్ల సాయంత్రం మబ్బు పట్టి ఉండటం, ఉదయం పూట పొగమంచు వంటి వాతావరణం కూడా కనబడుతోంది. కొన్ని రోజులుగా రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఎక్కువగా ఎండల్లో తిరిగితే వడదెబ్బ, ఆయాసం, వాంతులు, తలతిరగటం వంటి సమస్యలు వస్తాయి. అయితే ఎండలు ఎంత తీవ్రంగా ఉన్నా రోజువారీ పనులు చక్కబెట్టుకోవటం తప్పదు. ప్రతి ఒక్కరికీ రోజువారీ దైనందిన జీవనం మామూలుగానే ఉంటుంది. ఇంటి నుంచి బయటకు వెళ్లి పనిచేయక తప్పనిసరి పరిస్థితులున్నాయి. విపరీతమైన వేడి కారణంగా డీహైడ్రేషన్, చర్మ సంబంధిత వ్యాధులు, అలసత, కొందరికి రక్తపోటులో హెచ్చుతగ్గులు వంటి అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వుంటుంది. ఎండలో ఎక్కువ సేపు ఉంటే చర్మంపై ఎలాస్టిన్, కొల్లాజెన్ కణాల సంఖ్య తగ్గిపోతుంది. అందుకే ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో సాధ్యమైనంతవరకు ఎండలో తిరగకుండా ఉండటమే మంచి దని నిపుణుల సూచన. ఒక వేళ తప్పనిసరైతే చేతిలో గొడుగు లేదా టోపీ ధరించాలి. అలాంటి సమయం లో ప్రతి ఒక్కరూ తమ దిన చర్యలు కొన్ని మార్పులు చేసుకోవటం ద్వారా వేసవి సమస్యల నుంచి కొంతవరకైనా దూరంగా ఉండొచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. అవేమిటో తెలుసుకుందాం.




## డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి

పండ్లు నేరుగాగానీ, రసాల రూపంలో గానీ తీసుకుంటే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. సాఫ్ట్‌డ్రింక్స్ తీసుకోవటం వల్ల అందులోని సోడియం, పంచదారల వల్ల దాహర మరింత పెరుగుతుందేకాని తగ్గదు. పైగా వాటిల్లో ఇతరత్రా పోషకాలు ఉండవు. ఎండుద్రాక్ష, కర్జూరం, నారబెట్టిన నీళ్లను తాగినా మంచిదే. పారిజాత పూలను నీళ్లలో వేసుకుని తాగినా బెటరే. ఎండలకు శరీరం డీ హైడ్రేషన్‌ను గురవుతుంది. తద్వారా శరీరానికి ఎక్కువ ద్రవాలు అవసరం. అందువల్ల మజ్జిగ, లస్సీ, మిల్క్ షేక్ మొదలైన పానీయాలను తీసుకుంటే కొంత ఉపశమనం పొందొచ్చు. ఉప్పు, చక్కెర కలిపిన ద్రావణాన్ని కూడా తాగొచ్చు. ఇది శరీరంలో నీటి లోపాన్ని తొలగించటానికి సహాయపడే ఒక రకమైన ఎలక్ట్రోలైట్‌గా పనిచేస్తుంది. పుచ్చకాయలు, కొబ్బరి బోండాలు, దోస తరచూ తీసుకుంటే వాటిల్లోని నీరు, పోషకాలతో పాటు ఎలక్ట్రోలైట్స్ కూడా శరీరానికి అందుతాయి.

**సి విటమిన్ అందేలా చూడాలి**

విటమిన్ సి పుష్కలంగా ఉన్న ఆహారాన్ని తినటం వల్ల చర్మం సూర్య కిరణాలు, వాయు కాలుష్యంతో పోరాడటానికి సహాయపడతాయి. విటమిన్ సి పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలను ఈ కాలంలో తీసుకుంటే మంచిది. ఇవి శరీరాన్ని చల్లగా ఉంచటానికి దోహదపడతాయి. అధిక మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్లు వీటిలో ఉంటాయి. తద్వారా సూర్యుని కఠినమైన కిరణాల నుంచి శరీరాన్ని రక్షించటానికి దోహదపడతాయి.



**పచ్చి కూరగాయలు మేలు**

పచ్చికూరగాయలు తినటం ఎంతో మంచిది. వీటిలో కెరోటినాయిడ్ కంటెంట్ ఉంటుంది. వీటి ద్వారా శరీరంలో విటమిన్ ఎ ఉత్పత్తి అవుతుంది. శరీరంపై సూర్యరశ్మి చెడు ప్రభావాలను నివారించటానికి, ఆకుపచ్చ కూరగాయలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. పాలకూర, పుదీనాలను తినటం వల్ల కాల్షియం, ఐరన్, పొటాషియం, నీరు ఎక్కువగా శరీరానికి అందుతాయి.

జీర్ణవ్యవస్థను మెరుగుపర్చేలా అరటి, పెరుగు

ఎండల రోజుల్లో అరటిపండు, పెరుగు తినటం ఆరోగ్యానికి ఎంతో మంచిది. పెరుగులో ప్రో బయోటిక్స్ ఉంటాయి. వీటి వల్ల కడుపు చల్లగా ఉంటుంది. వేసవిలో డయేరియా సమస్యలను తగ్గించటంలో అరటి పండు ఎంతగానే ఉపయోగ పడుతుంది.

ఇందులోని పీచు జీర్ణ వ్యవస్థను కూడా బలపరుస్తుంది.

**డీహైడ్రేషన్‌కు గురయ్యే పదార్థాలు వద్దు**

ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారాన్ని తినకూడదు. అధిక ప్రొటీన్, చక్కెర ఆహారాలకు దూరంగా ఉండటం మంచింది. టీ, కాఫీ తాగటం వల్ల కూడా డీ హైడ్రేషన్ సమస్య వస్తుంది. ఎండల నుంచి బాహ్య శరీరాన్ని ఎలా కాపాడు కుంటామో అలాగే అంతర్గత శరీరాన్ని కూడా కాపాడుకోవటం చాలా ముఖ్యం. ఈ కాలంలో చాలా స్పైసీగా ఉండే ఫుడ్స్ తినకుండా ఉండటమే మేలు. ఇవి శరీర ఉష్ణోగ్రతను పెంచు తాయి.

## ఇవి పాటించండి మేలు

- వీలైనంత వరకూ ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి
- అతివేడి, అతిశీతల పానీయాలను తీసుకోవద్దు
- మజ్జిగను తరచుగా తీసుకోవాలి
- పెరుగు తీసుకుంటే చల్లదనం కలిగించడమే కాకుండా మంచి పౌష్టికాహారంగా కూడా పనిచేస్తుంది
- స్నానానికి సబ్బుకు బదులుగా సున్నిపిండి వాడితే శ్రేయస్కరం. పండ్ల రసాలు, కొబ్బరినీరు మొదలైనవి తరచూ తాగటం వల్ల చర్మ సౌందర్యంగా ఆకర్షణీయంగా ఉంటుంది
- ప్రతిరోజూ 8 నుంచి 10 గ్లాసుల నీటిని తాగాలి.
- స్నానం చేసే నీటిలో కొన్ని చుక్కలు వెనిగర్‌ను వేస్తే చెమట వాసన ఉండదు.
- నిమ్మరసం ముఖానికి రాసుకుని ఓ అరగంట తర్వాత



గోరు వెచ్చని -నీటితో కడిగితే ముఖం స్వచ్ఛంగా ఉంటుంది.
- ఎండలో తిరిగే సమయంలో జుట్టును గుడ్డతో కవర్ చేయాలి. లేదంటే ఎండ వేడికి వెంట్రుకలు చిట్లిపోయి రంగు మారిపోయే ప్రమాదం ఉంటుంది.
- ఎండ కారణంగా జాగ్రత్తలు తీసుకోకపోతే చర్మం నల్లబడటం, దద్దుర్లు రావటం, చర్మ క్యాన్సర్లు రావటం, మృదుత్వం కోల్పోవటం వంటి సమస్యలు ఎదురవుతాయి.





### ఉప ముఖ్యమంత్రి భట్టి తనయుడి వివాహం

## ప్రత్యేక ఆకర్షణగా 'పాదయాత్ర' బంధువులు

**ఉట్నూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య-సాక్షిల వివాహ వేడుకలో ఒక అపురూప ఘట్టం చోటుచేసుకుంది. రాజకీయ ప్రముఖులు, సెలబ్రిటీల మధ్య.. నాడు భట్టి విక్రమార్కతో కలిసి అడుగులేసిన ఆదివాసీ మహిళలు వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**అడవి బిడ్డల అనుబంధం...**

గత ఎన్నికలకు ముందు సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క గారు ఆదిలాబాద్ జిల్లా బోథ్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పాదయాత్రలో వీరంతా భాగస్వాములయ్యారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జైనూర్ మండలం బూసిమెట్టకు చెందిన వాలే లక్ష్మీబాయి, డాకూర్ రుక్మబాయి, దుర్గ సిందు, ఉట్నూరు మండలం దేవగూడకు చెందిన మరప గంగుబాయి, సుమన్ బాయి, సీడం లక్ష్మీబాయి. వీరంతా పాదయాత్ర ఆద్యంతం ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా, ఎండ తీవ్రతకు భట్టి అలసిపోకుండా, ఆయన ఆరోగ్యం దెబ్బతినకుండా సంప్రదాయ ఆదివాసీ పానీయాలను అందించి ఆత్మీయతను చాటుకున్నారు.

**మరువని కృతజ్ఞత.. పెళ్లి పీటలపై గౌరవం**

పదవులు వచ్చినా పాత మిత్రులను మరువని భట్టి విక్రమార్క, తన కుమారుడి వివాహానికి వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. వివాహ వేడుకకు హాజరైన ఆ ఆదివాసీ మహిళలను భట్టి దంపతులు ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కేవలం అతిథులుగా మాత్రమే కాకుండా, వారికి వివాహ వేదికపైనే ప్రత్యేకస్థానం కల్పించి కూర్చోబెట్టడం ఆకట్టుకుంది.

# మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలి




### మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు
### వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి
### ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష

**ఆదిలాబాద్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని ధైర్యంతో ముందడుగు వేయాలని అదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష అన్నారు. శుక్రవారం పట్టణంలోని వెటర్నరీ హాస్పిటల్ లో జరిగిన ఉమెన్స్ డే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ప్రభుత్వం కూడా మహిళల ఎదుగుదల కోసం ప్రత్యేక రిజర్వేషన్లు ఏర్పాటు చేసిందన్నారు. అందుకే తాము ఎంచుకున్న రంగాలలో మహిళలు రాణించాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే వైద్యులు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి తాను శాయ శక్తులా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




### ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని

## పకడ్బందీగా నిర్వహించాలి

### ఐటిడిఎ పిఓ యువరాజు మర్మాట్

**ఉట్నూర్, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అన్ని ఆశ్రమ పాఠశాలలో నిర్వహించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ పేర్కొన్నారు గురువారం క్యాంపు కార్యాలయంలో డిటిడిఓ ఏటీడీవోలు హెచ్‌డబ్ల్యుఓ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 ప్రత్యేక కార్యక్రమం సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ నెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యచరణ పై 99 రోజుల కార్యక్రమం ప్రధానంగా 10 అంశములపై కొనసాగుతుందని మార్చి 6 నుండి 15 వరకు ఆశ్రమ పాఠశాలలోని డార్మెంటరీ కిచెన్ ఆశ్రమ పాఠశాలలో పరిసరాలు స్టాక్ రూములు పరిశుభ్రంగా చేయాలని పనికిరాని పాత వస్తువులను ప్రోగు చేసి వేలం వాటి డబ్బులతో పాఠశాలలో రిపేర్ మెయింటెనెన్స్ చేయబడుతుందని తెలిపారు స్టాక్ రూములలో ఎలుకలు బొద్దింకలు కీటకాలు లేకుండా చూడాలని పాడైన పప్పులు సరుకులు బియ్యం జిసిసి పంపించడం జరుగుతుందన్నారు ఈ ప్రక్రియలో ఏమైనా పొరపాట్లు జరుగుతే ప్రధానోపాధ్యాయులు అదే బాధ్యత ఉంటుందన్నారు పాఠశాలల ఆవరణలో ఎటువంటి చెత్తాచెదారం లేకుండా చూడాలని ప్రతి ఆశ్రమ పాఠశాలలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరుగుతుందన్నారు పాఠశాలలకు జిల్లా కలెక్టర్,ప్రాజెక్టు అధికారి ఎప్పుడైనా తనిఖీలు చేయవచ్చని సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు పోటీ పరీక్షలకు అనుగుణంగా విద్యార్థులను గుర్తించి కాలేజీ ప్రిన్సిపల్ హెచ్ డబ్ల్యుఓలు పీఎంహెచ్ఎస్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ పిల్లలకు కల్పించుచు తద్వారా ఉపాధి పొందిన వారిని చూపించాలని తెలిపారు పదవ తరగతి పరీక్షలు రాయబోవు విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాసే విధంగా ప్రోత్సహించాలన్నారు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క విద్యార్థినీ విద్యార్థి బడి బయట లేకుండా బడిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వార్డెన్లు పాల్గొన్నారు.



విలేకరులు
కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



## పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

### మంచిర్యాల డీసీపీ ఎగ్గిడి బాస్కర్

**లక్షెట్టిపేట, మార్చి 5 (ప్రభాత సమాచారం)**

వచ్చే ఏడాది జూన్‌లో రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల డీసీ పీ ఎగ్గిడి బాస్కర్ అదికారులను ఆదేశించారు. గురువారం లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి వద్ద గల పుష్కరఘాట్‌ను ఆయన మంచిర్యాల ఏసీపీ ప్రకాష్‌తో కలిసి సందర్శించారు. డీసీపీ మాట్లాడుతూ గతంలో ఇక్కడ నిర్వహించిన గో దావరి పుష్కరాలకంటే వచ్చే ఏడాది జరుగే పుష్కరాలకు అంతకు మించి ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని అన్నా రు. అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రస్తు తం ఉన్న ఒక పుష్కరఘాట్ భక్తులకు సరిపోదని మరో ఘాట్ ఏర్పాటు చేసేం దుకు సంభందిత అ?ధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీసులు అంతా ఏర్పాట్లను రోజు చూసుకోవాలని ముఖ్యంగా పోలీసుశాఖ ట్రా ఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని రెవెన్యూ తరపున పార్కింగ్ కోసం పది ఎక రాల ప్రభుత్వ స్థలం తహసీల్దార్ మంజూరు చేసారని దాన్ని శుభ్రం చేపించు కోవాలన్నారు. నీరు కూడా ఎక్కువగా ఉండటంతో పుష్కరాల సమయంలో గజ ఈ తగాళ్లను అందుబాటులో ఎక్కువ మేరకు ఉంచాలని, ఆలయాల వద్ద కూడా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి పుణ్యస్నా నాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, సీఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్ ఉన్నారు.